క్లుప్తంగా

'సమస్యల పరిష్కారం కోసం పోరాటం'



మాట్లాడుతున్న గంగయ్య

ఇచ్చోడ: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరంగా పోరాడుతుందని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అన్నారు. 105 ఏఐటీయూసీ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఏఐయూటీసీ ముందు వరుస ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉచిత శిక్షణ

ఇచ్చోడ: గిరిజన యువతకు ఐటీడీఏ ఆధ్వర్యంలో హౌస్‌వైరింగ్, ప్లాంబింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేఆర్పీ ముకుంద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన యువతకు బెల్లంపెల్లి వైటీసీలో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసై, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు శిక్షణ అర్హులన్నారు. ఈనెల 28 లోపు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94914 67896 సంప్రదించాలన్నారు.

ఆర్థికసాయం

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తమ స్నేహితుడు పడిగెల రమేశ్ ఇటీవల మృతి చెందాడు. కాగా తమతో పాటు 1997– 1998లో పదో తరగతి చదువుతున్న రమేశ్ కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. రూ. 10వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నానక్ సింగ్, భోజన్న, భోజన్న, తులసీరాం, నర్సయ్య పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ తండ్రి అల్లం స్వామి మృతి చెందడంతో శనివారం ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు ఉన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

బోథ్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కోరారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ విత్తనాభివృద్ధి సంస్థ కేంద్రంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. విత్తనాభివృద్ధికి రైతులకు అన్యాయం జరగకుండా ఒప్పందాలు చేసుకోవాలని విన్నవించారు. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఉత్పత్తి అయిన విత్తనాలను మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేశ్, అబ్రాహర్, షేక్ అబూద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల విడుదల



చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

జైనథ్: మండలంలోని సాత్నాల ప్రాజెక్టు వద్ద శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ నీటిలోకి చేపపిల్లలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపపిల్లలు చాలా తక్కువ విడుదల చేయడం జరిగిందన్నారు. త్వరలో మరిన్ని చేపపిల్లలు విడుదల చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఇందులో మండల నాయకులు పాల్గొన్నారు.

28న బీసీ కమిషన్ చైర్మన్ రాక

తాంసి: ఈనెల 28న జిల్లా కేంద్రానికి బీసీ కమిషన్ చైర్మన్ రానున్నట్లు బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీసీ సంఘాల నాయకులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

వంటింట్లో ధరల మంట



ఆదిలాబాద్ రైతు బజార్ కూరగాయల మార్కెట్

- ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు
- సామాన్యుడిపై తీవ్ర భారం
- ధరలు నియంత్రించాలని కోరుతున్న ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుతం జిల్లాలో కూరగాయలు కోతకు రాలేదు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు ఆదిలాబాద్‌కు వస్తున్నాయి. రోజురోజుకూ కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని రైతుబజార్‌లో గత రెండు నెలల నుంచి ధరలు రెట్టింపయ్యాయి. రూ. 50 నుంచి రూ. 120 పెట్టనిదే ఎలాంటి కూరగాయ రావడం లేదు. కూరగాయల మార్కెట్‌కు రూ. 500 తీసుకొని వెళ్తే సంచి నిండా కూడా రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో సామాన్యులు వాటిని కొనలేని, తినలేని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ పొలాల్లోని కూరగాయలు చేతికి వచ్చేంత వరకు ధరలు ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇదిలా ఉండగా పెరుగుతున్న ధరలను నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఘాటెక్కిస్తున్న మిర్చి..
మండుతున్న వంకాయ..

ఏ కూరలోనైన టమాట, పచ్చిమిర్చి తప్పనిసరి. రోజువారీ వాడకంలో కీలకమైన వీటిలో మిర్చి ధర ఘాటెక్కిస్తుంది. దీని ధర ఏకంగా వంద దాటేసింది. గత రెండు నెలల నుంచి మిర్చి ధర అంతే పలుకుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా గత రెండు రోజుల కిందట టమాట కిలో ధర రూ. 80 ఉండే ప్రస్తుతం రూ. 50కి చేరింది. దొండ, బీర, కాకర వంటి కూరగాయల ధరలు వందకు చేరువయ్యాయి. మార్కెట్‌లో వంకయ మూడు రకాలు లభిస్తోంది. మొదటి రకం రూ. 100, రెండో రకం రూ. 80, మూడో రకం వంకయ రూ. 60 వరకు ఉంది. క్యారెట్, బీన్స్, బీట్‌రూట్, చిక్కుడుకాయ, ములక్కాయల ధరలు వందకు చేరువయ్యాయి. ఆకు కూరలదీ సైతం అదే పరిస్థితి. పాలకూర, మెంతికూర, తోటకూర (రెండు కట్టాలకు) రూ. 30, కొత్తి మీర రూ.10కి నలుగే పోసలు వస్తున్నాయి. కూరగాయల, ఆకుకూరల ధరలు మండిపోవడంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కిలోల్లో కొనుగోలు చేసే వారు పావు, అరకిలోతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి..

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంతో పాటు జిల్లాలో కూరగాయలు అంతగా పండించడం లేదు. ప్రధానంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూరగాయలు ఆదిలాబాద్‌కు వస్తున్నాయి. జిల్లాలోని రైతుల పొలాల్లో కూరగాయలు వెళ్లేంత వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

బ్యాగు నిండడం లేదు

గత రెండు, మూడు నెలల నుంచి కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కిలో కొందమంటే పావ్ కిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. కూరగాయల కోసం రూ. 500 మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం చిన్న బ్యాగు కూడా నిండడం లేదు. ఆకు కూరలైతే తినే పరిస్థితే లేదు.

– సంగీత, గృహిణి, ఆదిలాబాద్

ధరలు నియంత్రించాలి

టమాట ధర కిలోకు మొన్నటి వరకు రూ. 80 ఉండే. ప్రస్తుతం రూ. 50 ఉంది. తోగరి కాయనైతే రూ. 120కి కిలో ఉంది. మిర్చి, వంకయ వంటి కూరగాయలైతే వందకు చేరుకున్నాయి. ఆకు కూరలైతే రెండు కట్టాలు రూ. 30కి వస్తున్నాయి. కొంత ధరలను నియంత్రిస్తే బాగుంటుంది.

– రజిత, గృహిణి, ఆదిలాబాద్

రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

రకం	కిలో రూ.
టమాట	రూ. 50
పచ్చిమిర్చి	రూ. 100
వంకాయ	రూ. 100
బీరకాయ	రూ. 80
చిక్కుడుకాయ	రూ. 100
గోరు చిక్కుడు	రూ. 80
పచ్చిమిర్చి	రూ. 90
పువ్వుగోబి	రూ. 80
ఆకు గోబి	రూ. 80
క్యారేట్	రూ. 60
మునగకాయలు	రూ. 100
బెండకాయ	రూ. 60
తోగరి కాయ	రూ. 120
బబ్బేర కాయ	రూ. 100
అలచెంత కాయ	రూ. 80
ఆకు కూరలు..	
మెంతి(రెండు కట్టలు)	రూ. 30
పాలకూర (రెండు కట్టలు)	రూ. 30
గోంగుర(రెండు కట్టలు)	రూ. 30
కోతి మీర (చిన్న కట్ట)	రూ. 10

ఘనంగా భీం విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న భీం మనవడు కుమురం సోనేరావు

నార్నూర్: విప్లవ వీరుడు ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యుడు కుమురం భీం ఆశయం నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కుమురం భీం మనవడు కుమురం సోనేరావు, రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ అననారు. శనివారం మండలంలోని నార్నూర్, జైనూర్ మండలాల సరిహద్దు గ్రామమైన ఇలాయిజ్‌నగర్ వద్ద భీం విగ్రహాన్ని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి ఆవిష్కరించారు. అంతకు ముందు ఆదివాసీ గిరిజనులు సంప్రదాయ పూజలు చేసి, భీం జెండా ఆవిష్కరించారు. జల్ జంగల్ జమీన్ కోసం నైజాం ప్రభువులతో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. చదువుతోనే సమాజం జాగృతం అవుతుందని, చదువుకుంటునే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గ్రామపటేల్ పూసం హన్మంతరావు, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడం గోపిచంద్, తొడసం నాగోరావు, కనక ప్రభాకర్, ఉర్వేత రూప్‌దేవ్, పూసం ఈస్రు, పూసం లచ్చు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: కులవృత్తిదారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శనివారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులవృత్తులను అభివృద్ధి చేసేందుకు విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించి సంవత్సరం పూర్తి కావస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన ద్వారా కేంద్రానికి పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినాథ్, లాలామున్న, సంజు, గంటా సురేశ్, పద్మ కృష్ణ, దశరథ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

తాంసి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని తాంసి గ్రామ యువకులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆధార్ నమోదు, సవరణలతో పాటు ఆధార్ అప్డేట్‌కు ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కంటే అధికంగా డబ్బులు వసూల్ చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే ఆధార్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో యువకులు రాము, అశోక్, రాము యాదవ్, లింగన్న, రాజు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆరోపించారు. కేటీఆర్ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్‌కు రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గాడ్గే సుభాష్, శ్రీకాంత్‌రెడ్డి, పాండురంగ్, రాథోడ్ ప్రవీణ్, జాహెద్, నర్వాడే రమేశ్, మహేందర్‌రెడ్డి, ఆర్గుల గణేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న సీఐ భీమేశ్

ఇచ్చోడ: విధి నిర్వహణలో అమరులైన పోలీసు అమరవీరుల సేవలు చిరస్థాయి నిలిచిపోతాయని ఇచ్చోడ సీఐ భీమేశ్ అన్నారు. పోలీస్ సంస్మరణ వారోత్సవాల భాగంగా శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పోలీసుశాఖ ముందుంటుందన్నారు. అమరులైన వారి కోసం ప్రతీ ఏటా పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 90 యూనిట్ల రక్తన్ని ఆదిలాబాద్ బ్లడ్ బ్యాంక్‌కు అందచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ, నేరడిగొండ, గుడిహత్నూర్ ఎస్సైలు తిరపతి, శ్రీకాంత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలని గుబిడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమార్కులు మహారాష్ట్రకు ట్రాక్టర్ల ద్వారా తరలించడం గ్రామ రోడ్డు ధ్వంసమవుతుందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు రవీందర్ రెడ్డి, దత్తు, ఇస్తాయి, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభకు తరలిన నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలోని ఎద్దులపాడ్ గ్రామంలో శనివారం నిర్వహించిన ఆదివాసీ బిరుదు గొండ్ తోటి ఆదివాసీ అమరవీరుడు వెడ్మ రాము 37వ వర్ధంతి సభకు ఇంద్రవెల్లి మండల నాయకులు తరలివెళ్లారు. ముందుగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆదివాసీ బిరుదుగొండ్ హక్కుల సాధన కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు నైతం శేఖర్, కాంత్లే పృథ్వీరాజ్, నైతం రమేశ్, సోయం విఠల్, మెస్రం మారుతిపటేల్, రాము పటేల్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి చేయూత



ఆర్థికసాయం చేస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన యువకుడు గతకొద్ది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా వసుధ ఫౌండేషన్ ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును టీయూటీఎఫ్ సభ్యులు శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కాగా.. యువకుడికి ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. శిక్షణలో భాగంగా మెడికల్ టెస్టు నిర్వహించగా, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం ఎన్నిక

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నూతన అధ్యక్షుడు సంజీవ్‌రావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సూర్యప్రకాశ్, ఖదీర్ అహ్మద్, ఎం.రాఖీ, ప్రధాన కార్యదర్శిగా దుర్గయ్య, సంయుక్త కార్యదర్శులుగా గంగన్న, మల్లేశ్, నర్సరెడ్డి, నసీమా, కోశాధికారిగా రాందాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సత్యనారాయణ, దేవేందర్, ప్రచార కార్యదర్శిగా నాగభూషన్, సభ్యులుగా అశోక్, తాలిబ్, నైమతుల్లాఖాన్, గజానన్, స్వప్నలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

పద్మశ్రీ కనకరాజుకి సంతాపం

ఎదులాపురం: పద్మ శ్రీ అవార్డు గ్రహిత ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు విశేష కృషి చేసిన పద్మశ్రీ కనకరాజు మృతికి సీపీఎం జిల్లా కమిటీ తరపున సంతాపం తెలుపుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మరణం ఆదివాసీ సమాజానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు తీరని లోటన్నారు.

బోథ్: పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మృతి పట్ల బోథ్ మండల బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. ఆయన మృతి ఆదివాసీ సమాజానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు తీరనిలోటని మండల కన్వీనర్ బోరె రవీందర్ అన్నారు. వారికుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉచిత యాప్ సద్వినియోగించుకోండి

ఎదులాపురం: ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ఆరు నెలల పాటు అందిస్తున్న పోటీ పరీక్షల ఉచిత యాప్‌ను సద్వినియోగించుకోవాలని వీఎస్ఆర్ ఆదిలాబాద్ కార్యాలయ ఇన్‌చార్జి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు, విద్యా విధానం అవగాహన సదస్సులో భాగంగా జిల్లా కేంద్రానికి ఈనెల 30న నరేందర్‌రెడ్డి రానున్నట్లు, అదే రోజున స్థానిక జిల్లా గ్రంథాలయంలో యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దండారీ ఉత్సవాల్లో పాల్గొన్న గజేందర్



ఆదివాసీలతో గజేందర్

బోథ్: మండలంలోని పట్నాపూర్ (మేడిగూడ) గ్రామంలో శనివారం నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, శాలుశాతో సత్కరించారు. దండారీ ఉత్సవాలకు ప్రత్యేకంగా సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు పెంచేలా చూస్తామన్నారు. ఆదివాసీ రాయిసెంటర్లను అభివృద్ధి చేస్తామననారు. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, బద్దం పోతారెడ్డి, కుర్మె మహేందర్, బత్తుల రమేశ్, అబ్రాహర్, ఆడె మోహన్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కుర్మె లక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్, ఆర్ఐ సునీత గురువారం రూ. లక్షా పదహారు వేల చెక్కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ల అఖిలాష్, ప్రశాంత్, నరేందర్, తుల హరీష్, మృణాల్ గౌడ్, రామాయి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ వాసులకు మళ్లీ నిరాశ..!




బోథ్ నియోజకవర్గ కేంద్రం

- ఏటూరు నాగారం డివిజన్‌గా ఏర్పాటుకు కేబినేట్ నిర్ణయం
- బోథ్ డివిజన్ ఊసెత్తని ప్రభుత్వం

బోథ్: బోథ్ ప్రజలకు ప్రభుత్వం మళ్లీ నిరాశ పరిచింది. శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఏటూరు నాగారంను డివిజన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కానీ బోథ్‌పై ఎలాంటి ప్రస్తావన జరగలేదు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అప్పట్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో బోథ్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్, 31లోపు రెవెన్యూ డివిజన్ చేస్తామని ప్రకటించారు. ఆ మాట హామీగానే మిగిలిపోయింది. ఏటూరు నాగారంను డివిజన్ చేస్తూ తీర్మానం చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకున్నా.. బోథ్‌ను ఎందుకు డివిజన్‌గా చేయలేదని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బోథ్ డివిజన్‌ను ప్రభుత్వం పక్కనబెట్టిందా అన్న సందేహాలు ఇక్కడి ప్రజల్లో తెలెత్తుతున్నాయి. బోథ్‌ను డివిజన్ చేయడంలో తాత్సారం చేస్తుండటంతో ఇక్కడి ప్రజలు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. బోథ్‌ను నియోవకవర్గాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలని, డివిజన్ చేస్తే అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. శనివారం మండలంలోని కుంటాల(కె) బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 101 మంది రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఈవో పవార్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ నిఖత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబారావు, ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్ పాల్గొన్నారు.